ప్రజాశక్తి
గురువారం 6 జులై 2023
5
అల్లూరి సీతారామరాజు

ఆదివాసీ గిరిజన సంఘం నేతలపై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి -అనంతగిరి : గిరిజనులకు అండగా ఉండి,వారి హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషి చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలపై హుకుంపేట మండలంలో వైసిపి సర్పంచ్ అనుచరులు భౌతిక దాడులకు పాల్పడడం దుర్మార్గమని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సివేరి కొండలరావు, జె.సుబ్బారావు ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుకుంపేట మండలంలో సర్పంచ్ వెంకటపూర్ణిమ అనుచరులు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు తాపుల కృష్ణారావు మరికొందరిపై దాడులు చేశారన్నారు. 1/70, పీసా వంటి గిరిజన హక్కుల చట్టాలను తుంగలో తొక్కి, హుకుంపేట మండల కేంద్రంలో గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే వారికి అండగా నిలుస్తూ తోటి గిరిజన నాయకులపై దాడులు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు గొంతు విప్పి ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆగని డోలీ మోతలు

గిరిజనం అవస్థలు... పట్టని అధికారులు

గాలిపాడు నుంచి గర్భిణిని డోలీతో తెస్తున్న కుటుంబీకులు

ప్రజాశక్తి -హుకుంపేట: మన్యవాసులకు అల్లూరి పేరుతో ప్రత్యేకంగా జిల్లా ఆవిర్భవించినప్పటికీ, నేటికీ అక్కడి గిరిజనుల కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా అత్యవసర వైద్యం సమయంలో నేటికీ డోలిమోతలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తమౌతోంది. అభివృద్ధికి ఆమడ దూరంలో గత్తుం పంచాయతీ పరిధిలో పదేపదే ఒకే పరిస్థితులు పునరావృతం కావడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంపై దిగులు చెందుతున్నారు. మండలంలోని గత్తుం పంచాయతీ గాలిపాడు గ్రామానికి చెందిన పేటేటి చెల్లమ్మ అనే గర్భిణీ విపరీతమైన కడుపు నొప్పి రావడంతో కుటుంబసభ్యులంతా తల్లడిల్లిపోయారు. అత్యవసర వైద్యానికి తీసుకెళ్లాలంటే గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అంబులెన్స్‌గాని, ఆటోలు, ఇతర వాహనాలుగాని రాలేని పరిస్థితి ఉంది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో చెల్లమ్మ భర్త రామన్నతోపాటు ఆశావర్కర్ సాయంతో తోటి గ్రామస్తుల సహకారం తీసుకుని, దాదాపు మూడుకిలోమీటర్లు దూరం డోలీలో గర్భిణిని ఎంతో శ్రమించి గాలిపాడు నుంచి గత్తుం పంచాయతీ కేంద్రం వరకు తీసుకొచ్చారు. అక్కడ అంబులెన్స్‌లో ఎక్కించి పాడేరు జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యానికి అనునిత్యం తాము పడుతున్న అవస్థలను జిల్లాకలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర నేతలకు విన్నవించినా ఎటువంటి స్పందన లేదని గాలిపాడు గ్రామస్తులు వాపోతున్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి, డోలీకష్టాలకు విముక్తి కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.

జగనన్న సురక్ష శిబిరాలలో

ధ్రువీకరణల జారీకి మూడు కౌంటర్లు

- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో నెట్ సౌకర్యం ఉన్న శిబిరాలలో ధ్రువపత్రాల రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, జారీకి మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి అక్కడికక్కడే లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. బుధవారం జిల్లాలో 3991 ధ్రువపత్రాలు పంపిణీ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల పరిధిలోని 20 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. 18,633 గృహాలనుంచి వాలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 14,855 వినతులు రాగా, 13,973 టోకెన్లు నమోదు చేశారు. 9,683 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి, అందులో 3991 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని, 21 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా, మిగిలిన 5671 సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని కలక్టర్ వివరించారు. ఆన్‌లైన్‌లో నమోదైన ధ్రువపత్రాలను రానున్న రెండు రోజుల్లో పంపిణి చేస్తామన్నారు. జగనన్న సురక్ష శిబిరాల వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల సేవలు, వైద్య శిబిరాల సేవలు కూడాప్రజలు వినియోగించుకోవాలని కలక్టర్ కోరారు.

భీంపోలు భూసమస్య పరిష్కారానికి చర్యలు

జగనన్న సురక్షలో జెసి సాయిశ్రీనివాస్

గ్రామసభలో మాట్లాడుతున్న జెసి సాయిశ్రీనివాస్

ప్రజాశక్తి- అనంతగిరి : భీంపోలు భూసమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సాయి శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొన్న జెసి, ఇతర అధికారులకు భూసమస్యపై స్థానిక గిరిజనులు ఫిర్యాదు చేశారు. గిరిజనేతర పంచాయతీ కావడంతో భూసమస్యలు అధికంగా ఉన్నాయని, గిరిజనుల సాగు భూములకు ఆన్‌లైన్‌లో ఇతరుల పేరుతో ఉంటున్నాయని, పంచాయతీలో సమగ్ర రీసర్వే చేపట్టి గిరిజన సాగు భూములకు హక్కు పత్రాలను ఇవ్వాలని కోరారు. దీనిపై జెసి సాయిశ్రీనివాస్ స్పందించి విఆర్ఒకు తగు సూచనలు చేశారు. మండల ప్రత్యేకాధికారి సూర్యలక్ష్మి, వైసిపి నేతలు శెట్టి గంగాధరస్వామి, సర్పంచ్ బిమ్మాలమ్మ, ఎంపిటిసి అశోక్, కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా, అదనపు సిడిపిఒ అచ్యుత, విఆర్ఒ రాంబాబు. ఉప సర్పంచ్ అప్పలకొండ. వైసిపి నాయకులు ఈశ్వరరావు సతీష్ పాల్గొన్నారు.

ఖాళీ ఉద్యోగాల భర్తీకి

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎఐవైఎఫ్ నేతలు

ప్రజాశక్తి - పాడేరు: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ వెంటనే భర్తీచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 6న గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ముువ్వల లక్ష్మణరావు వెల్లడించారు. బుధవారం పాడేరులో డిమాండ్స్‌తో కూడిన ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలన్నారు. పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు, ఎపిపిఎస్‌సి గ్రూప్ 1,2 ,4 తోపాటు వివిధ శాఖల లోని ఖాళీలను భర్తీచేయాలన్నారు . ఎపిపిఎస్‌సి, ఇతర ఉద్యోగ నియామక పరీక్షల ప్రశ్నాపత్రాలు తెలుగును ప్రామాణికం చేసుకొని తయారు చేయాలన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్ష విధానం రద్దుచేసి, ఒకే పరీక్ష నిర్వహించాలని, నెగటివ్ మార్కులు తీసివేయాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాలలో ఖాళీగా ఉన్న 20 వేల ఉద్యోగాలను భర్తీచేయాలన్నారు. కళాశాలలు, విశ్వవిద్యాలయ అధ్యాపక ఉద్యోగాలు భర్తీచేయాలన్నారు. మెగా డిఎస్‌సి విడుదల చేసి ఖాళీగా ఉన్న 55వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీచేయాలన్నారు, పోటీ అభ్యర్థులకు శిక్షణనిచ్చేందుకు ప్రతి జిల్లాలో ప్రభుత్వ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వయో పరిమితి 45ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.శ్రీనుబాబు, కృష్ణబాబు, అఖిల్ చంటిబాబు పాల్గొన్నారు.

ధరాభారంపై ఐద్వా ఆందోళన

నిత్యావసరాల ధరలను నియంత్రించాలని నిరసన

ఆందోళన చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

ప్రజాశక్తి - హుకుంపేట : ఆకాశాన్నంటుతున్న కూరగాయలు, ఇతర నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు బుధవారం హుకుంపేట మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి హైమావతి మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా పెరుగుతున్న ధరలతో సామాన్య, మధ్యతరగతి ఏమీ కొనలేని పరిస్థితుల్లో బతుకు దుర్భరంగా గడుపుతున్నారన్నారు. గత నెలలో రూ.40లోపే ఉన్న టమోటా కిలో ఇపుడు రూ.140లకు చేరిందని, ఇతర కూరగాయల ధరలన్నీ కిలో వంద రూపాయలే పలుకుతుంటే పేదలు ఏంకొని, ఏం తినాలని ప్రశ్నించారు. పప్పులతో అన్ని నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను అదుపు చేసి సామాన్యులకు ఉపశమనం కల్పించే చర్యలు ప్రభుత్వమే వెంటనే తీసుకోవాలని కోరారు. కందిపప్పు కిలో ధర రూ.150లకు పెరిగిపోగా, రేషన్ షాపుల ద్వారా ఇస్తున్న కందిపప్పును కూడా గత రెండు నెలలుగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరల నేపథ్యంలో 14 రకాల నిత్యవసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా రాయితీ ధరలపై అందించాలని, ధరల పెరుగుదలకు కారణాలపై దృష్టిపెట్టి తగు చర్యలు చేపట్టడంతోపాటు బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు సుహాసిని, వనం, మణెమ్మ, రవణమ్మ పాల్గొన్నారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటం

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి- అరకులోయ : స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం విశాఖపట్నం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఉత్తరాంధ్ర సిపిఎం జిల్లా కార్యదర్శులు 24 గంటల నిరసన దీక్ష జయప్రదం చేయాలని అల్లూరి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు.బుధవారం ఎపి ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో అప్పలనాష్ట మాట్లాడుతూ, ఈనెల 7వ తేదీన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 24 గంటల నిరసన దీక్ష చేస్తున్నమన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం సిద్ధపడడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్మికుల హక్కులు కాలరాస్తూ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనుల కేటాయించకుండా ఆంధ్ర రాష్ట్రానికి గుండెకాయలాంటి స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పూనుకుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. 64 గ్రామాల రైతులు 22 వేల ఎకరాల భూమి త్యాగం చేసిన నిర్వాసిత రైతులకు ఉపాధి కల్పించాలని కోరారు.. 32 మంది ప్రాణాల బలిదానం, 64 మంది కమ్యూనిస్టులు, ఇతర ఎమ్మెల్యేల పదవి త్యాగంతో సాధించిన విశాఖ ఉక్కును నరేంద్ర మోడీ ప్రవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం మూడేళ్లుగా కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు పోరాడుతున్నా, కేంద్ర ప్రభుత్వం కనీసం ప్రజల మనోభావాలను గుర్తించకుండా, వాటిని విలువనిచ్చి స్పందించకుండా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కట్టుబడి ముందుకు సాగడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన పార్టీలు కూడా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకుండా ప్రకటనలకు పరిమితం కావడం బాధాకరమ న్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం కార్మికులకు అండగా నిలబడిప్రత్యక్ష పోరాటానికి వచ్చి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సహకరించా లన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, డుంబ్రిగుడ పార్టీ మండల కార్యదర్శి ఎస్‌బి. పోతురాజు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్

డాక్టర్ డికె.చరణ్

ప్రజాశక్తి -హుకుంపేట: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మూడు నెలల పైబడిన పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీరేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ డికె.చరణ్ తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుండి మనుషులకు పలు అంటువ్యాధులు సంక్రమించకుండా, వాటికి సరైన సమయంలో తగు వ్యాక్సినేషన్ చేయించాలని, తద్వారా వ్యాధులను నివారించవచ్చన్నారు. జునోసిస్ డే సందర్భంగా హుకుంపేట పశువైద్యకేంద్రంలో పెంపుడు కుక్కలకు వేసే ఉచిత వ్యాక్సినేషన్‌ను హుకుంపేట, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముకునూరును పోలవరం ముంపు జాబితాలో చేర్చాలి

నినాదాలు చేస్తున్న పోలవరం గ్రామస్తులు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ముకునూరు గ్రామాన్ని పోలవరం ముంపు జాబితాలో చేర్చి తక్షణం పరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సిపిఎం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలోనాయన మాట్లాడుతూ పోలవరం ముంపు జాబితాలో మండలంలో మొదట నోటిఫికేషన్ ఇచ్చి రైతుల భూమికి పరిహారాన్ని 2009లో ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి రూ.1.15 లక్షలు ఇచ్చారని, నేటికీ 12 ఏళ్లుగా గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చలేదని తెలిపారు. ప్రతి ఏటా వరదలు ముంపులకు ముకునూరు గ్రామం అంతా మునిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు ముకునూరు గ్రామం పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ముకునూరును మొదటి కాంటూర్ గ్రామంగా గుర్తించడంతో పాటు గ్రామం మొత్తం ఉన్న కుటుంబాలకు పరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 1986, 2022 వరదలకు ప్రామాణికంగా తీసుకొని ముంపు గ్రామాలను గుర్తించి పరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కారం నగేష్, బడిశా శేషు, మడకం రాంప్రసాద్, సోదే సింగమ్మ, వెట్టి రాజు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్

అన్నవరం గ్రామాన్ని

పోలవరం మొదటి జాబితాలో చేర్చాలని ధర్నా

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని అన్నవరం గ్రామాన్ని పోలవరం మొదటి జాబితాలో చేర్చాలని కోరుతూ ఆ గ్రామస్తులు బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ గ్రామాన్ని మొదటి జాబితాలో చేర్చి పునరావాసం ప్యాకేజీ ఇవ్వాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వీరికి సిపిఎం నాయకులు, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రవ్వా రామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో8 సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, సిపిఎం, టిడిపి నాయకులు బుర్కా కన్నారావు, ప్రకాష్ రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొండరెడ్ల అభివృద్ధికి చర్యలు

కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అండర్ కార్యదర్శి సుశీల్ బడింగ్

ప్రజాశక్తి - రంపచోడవరం

రాష్ట్రంలోని కొండ రెడ్డి కులస్తుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోనున్నట్లు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అండర్ కార్యదర్శి సుశీల్ బడింగ్ పేర్కొన్నారు. మండలంలోని వేములకొండ పంచాయితీ పరిధిలోని కొండ రెడ్లకు చెందిన చేలకవీధి గ్రామంలో ఆయన పర్యటించారు. రాష్ట్రపతి పంపిన టీం ద్వారా కొన్ని గ్రామాల్లో పర్యటించి, అక్కడి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించడానికి కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అండర్ కార్యదర్శి సుశీల్ బడింగ్, ఎపి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ట్రైకార్ జనరల్ మేనేజర్ మణికుమార్ ఈ పర్యటన చేశారు. కొండరెడ్ల కులస్తులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుశీల్ బడింగ్ మాట్లాడుతూ దేశంలో సుమారు 720 రిజర్వేషన్‌కు సంబంధించిన కులాలు ఉన్నాయని, 75 తెగలను పివిటిజిలుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. పివిటిజిల గ్రామాలను అభివృద్ధి చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామంలోని కొండ రెడ్లకు అడవి హక్కుల చట్టం ద్వారా పట్టాలు ఎంతమందికి మంజూరు చేసింది ఆరా తీసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఏపీవో సిహెచ్ శ్రీనివాసరావు, సర్పంచ్ పండు దొర, ఎంపిటిసి నర్రి పాపారావు, డిఇలు ఏ వెంకటేశ్వరరావు, రాజేంద్ర బాబు, ఎడబ్ల్యుఒ రామ తులసి, తహశీల్దారు పివివి జయ సూర్య కుమార్, ఎంపీడీవో హరికృష్ణ, ఉపాధి పథకం ఏపీవో సాయిబాబా, ఏపిఎం అప్పారావు, వైటిసి మేనేజర్ సుదీర్, ఏఈలు సత్యనారాయణ, పి వెంకట్ రమణ, భీమశంకర్, శ్రీనివాసరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న సుశీల్ బడింగ్

మావోయిస్టు క్యాంపు వేసిన ప్రాంతం ఇదే...

దద్దరిల్లిన అటవీ ప్రాంతం

- మావోయిస్టు క్యాంపుపై పోలీసుల దాడి

- ఇరు గ్రూపుల మధ్య కాల్పులు

ప్రజాశక్తి-చింతూరు

బీజాపూర్ జిల్లాలోని ఇసుల్నార్ అటవీ ప్రాంతం బుధవారం కాల్పులతో దద్దరిల్లింది. మావోయిస్టు క్యాంపుపై పోలీసులు దాడి చేసిన నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం... ఇసుల్నార్ అటవీ ప్రాంతంలో రెండో కంపెనీకి చెందిన మావోయిస్టు కమాండర్ వేల్లా మోడియం, డివిజన్ మిలటరీ ఇన్‌ఛార్జ్ రాహుల్ తేలమ్, గంగలూరు అసిస్టెంట్ కమాండర్ దినేష్ మోడియం, డీసీఎం భాస్కర్, ఏసీఎం వర్గీష్‌తోపాటు 40 నుంచి 50 మంది మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. డీఆర్జీ, ఎస్టీఎఫ్ బలగాలతోపాటు 210 కంపెనీ కోబ్రా బలగాలు మావోయిస్టులు సమావేశమైన ప్రదేశానికి చేరుకున్నాయి. పోలీసులను గమనించగానే మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. దీంతో పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పులు గంటకు పైగా కొనసాగాయి. ఆ తరువాత మావోయిస్టులు కాల్పులు జరుపుతూ అడవి లోపలికి వెళ్లిపోయారు. సంఘటనా స్థలం నుంచి పోలీసు బలగాలు ఓ టిఫిన్ బాక్స్, బాంబు, విద్యుత్ వైరు బండిల్, ఫ్యూజ్ వైర్, డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో కనీసం ముగ్గురు మావోయిస్టులు చనిపోయి లేదా గాయపడి ఉండవచ్చని పోలీసు వర్గాలు తెలిపాయి. పోలీసుల వైపు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

డెంగీ, మలేరియా జ్వరాలపై దృష్టి

ఐటిడిఎ పిఒ ఆదేశం

ప్రజాశక్తి-చింతూరు

వర్షా కాలంలో వచ్చే మలేరియా, డెంగీ తదితర జ్వరాలపై దృష్టి సారించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సబ్ యూనిట్ ఆఫీసర్లు, హెల్త్ అసిస్టెంట్లతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెల్త్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా గృహ సందర్శన చేయాలని, మలేరియా పాజిటివ్ కేసులు నమోదైతే అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్తాయి సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ల పని తీరును రెగ్యులర్‌గా పరిశీలించాలని ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్‌ని, వైద్యాధికారులను ఆదేశించారు. మలేరియా, డెంగీ నివారణకు సంబందించిన అన్ని రకాల కెమికల్స్, మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని మలేరియా డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ చంటిబాబుని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పుల్లయ్య, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిటిసి వంశి, సర్పంచ్ రమేష్

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని ముసురిమిల్లి రైతు భరోసా కేంద్రంలో 90శాతం రాయితీ విత్తనాలను రైతులకు స్థానిక ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం, సర్పంచ్ కోసు రమేష్ బాబు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిహెచ్‌సి గ్రూప్‌లకు యంత్ర పరికరాలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నాయకులు బోబ్బా శేఖర్, రాజన్న దొర అగ్రికల్చర్ అసిస్టెంట్ కరం చంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాజీ ఎమ్మెల్యే ముఖాముఖి

ప్రజాశక్తి -రంపచోడవరం

మండలంలోని అకూరు పంచాయితీ, కొయ్యలగూడెం గ్రామ ప్రజలతో భవిష్యత్‌కి గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి బుధవారం ముఖ ముఖి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, నాయకులు కారం సింహాచలం, దిడ్డి జనార్ధన్, వై.నిరంజని దేవి, కారం శేషాయమ్మ, సిద్దా వెంకన్న దొర, కుంజం బాపన్న దొర, పాక రాజు, నేరం వీరస్వామి, మడకం శ్రీనివాసు దొర, సాదల సత్యనారాయణ రెడ్డి, చుంద్రు అబ్బాయి రెడ్డి, అరగటి బాపి రెడ్డి, చుంద్రు మంగిరెడ్డి, ఉగ్గిరాల భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

స్థలాన్ని పరిశీలిస్తున్న తహాశీల్దార్ వేణుగోపాల్

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం

ప్రైవేటు స్కూల్ యాజమాన్యం నిర్వాకంపై సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రభుత్వ స్థలం, రోడ్డును విజ్ఞాన భారతి స్కూల్ యాజమాన్యం, గిరిజనేతరుడైన కాంట్రాక్టర్ అప్పలరాము ఆక్రమించి ప్రహరీ నిర్మించారని సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు బుధవారం మండల తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహాశీల్దార్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, శరభగుడ, కంటబౌంసుగుడ, సి కాలనీ, హౌసింగ్ కాలనీ, అరకువేలి టౌన్‌షిప్‌కు మంచినీరు అందించే కుళాయి గొట్టాలు ఉన్నప్పటికీ ఆక్రమించి రాత్రికిరాత్రే జెసిబితో వాటిని కప్పేసి ఆక్రమించారని ఆరోపించారు. జెసిబితో తవ్వడంతో కుళాయి పైపులకు రంధ్రాలు ఏర్పడి రెండురోజులుగా స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారని వివరించారు బివికె పాఠశాల యాజమాన్యం తమ స్థల సరిహద్దులను వదిలేసి ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే మార్గాన్ని మూసేసి,ప్రహరీ నిర్మించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, జూనియర్ కళాశాల యాజమాన్యం మౌనంగా ఉండి ప్రవేట్ యాజమాన్యానికి మద్దతున్వివడం, రెవిన్యూ అధికారులు కూడా గిరిజనేతరులకే కొమ్ముకాసేలా వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై తక్షణమే స్పందించి చర్యలు చేపట్టకుంటే కలెక్టర్,పిఒలకు ఫిర్యాదుచేస్తామన్నారు. దీనిపై స్పందించిన మండల తహాశీల్దార్ వేణుగోపాల్ ప్రజలు రాకపోకలకు దారి ఇవ్వాలని, స్కూల్ పరిధి దాటి ప్రభుత్వ స్థలంలోకి వస్తే బైండోవర్ కేసు పెడతామని స్కూల్ యాజమాన్యానికి హెచ్చరించారు. కార్యక్రమంలో విఆర్ఒ కోటేశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం'

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజవొమ్మంగి : సమస్యలు సత్వర పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని లబ్బర్తి గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు ఆధ్వర్యంలో సర్పంచ్ మిరియాల సత్యవతి అధ్యక్షతన జరిగింది. పలువురు లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లాగరాయి సర్పంచ్ మిరియాల ఘనలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బొడ్డు వెంకటరమణ, డిప్యూటీ తహాశీల్దార్ అల్లి సత్యనారాయణ, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, జేసీఎస్ నాయకులు వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, కన్వీనర్లు అంజిబాబు, సత్యానందం, వీరరెడ్డి బాబ్జి పాల్గొన్నారు.

కొయ్యూరు : దరఖాస్తు చేసుకున్న రోజే సర్టిఫికెట్ల మంజూరు చేయడం అనేది ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఇది తొలిసారి అని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రం, రేవళ్ల గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రేవళ్ల గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొని పలు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు రమణ, నూకాలమ్మ, వైసిపి నాయకులు రాజులమ్మ, గాడి నాగమణి, జల్లిబాబులు, బండి సుధాకర్, అచ్యుత్, ముసలి నాయుడు, బాబూజీ, గాడి సత్యనారాయణ, వనం బాబు, శేఖర్, ప్రసాద్, గంగాధరం, శోభన్ పాల్గొన్నారు.

జి. మాడుగుల : మండలంలోని శోలభం-1, గడుతూరు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష నిర్వహించారు. 11 రకాల సేవలను లబ్దిదారులకు ఉచితంగా అందిస్తారని, అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డిపిఆర్ఒ పి. గోవిందరాజులు సూచించారు. శోలభం-1 సచివాలయ పరిధిలో 563 టోకెన్లు నమోదు కాగా, 507 ఆన్‌లైన్ చేశారు. 363 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. గడుతూరు సచివాలయ పరిధిలో 1423 టోకెన్లు నమోదు కాగా 519 ఆన్‌లైన్‌చేసి, 340 ధ్రువీకరణలు ఇచ్చారు. కార్యక్రమాలలో ఎంపిపి కె.పద్మ, తహాశీల్దార్ అప్పలస్వామి, ఎంపిడిఒ చంద్ర శేఖర్, ఎఒడబ్ల్యుఒ పాల్, సిడిపిఒ సువర్ణమ్మ, జెసిఎస్ ఇన్‌ఛార్జి లెంకల కల్యాణ్, సర్పంచులు హనుమంతరావు, కె. అప్పలమ్మ పాల్గొన్నారు.

తుప్పల్లో 'ఉపాధి' బోర్డులు

అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు
రూ.లక్షల ఉపాధి నిధులు దుర్వినియోగం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల్లో పెట్టాల్సిన నేమ్ బోర్డ్స్ స్థానిక మండల కేంద్రంలోని అల్లూరి గ్రౌండ్‌లోని తుప్పల్లో నిరుపయోగంగా పడిఉన్నాయి. సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి.
ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో వివిధగ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు, ఏయే పనిని ఎంత అంచనాతో చేపట్టారు, వాటికి వెచ్చించిన నిధులెంత, ఎంతమంది కూలీలు పనిలో పాల్గొన్నారు తదితర నిర్ధిష్టమైన వివరాలతో ప్రతి పనికి ఒక్కొక్క బోర్డును తయారుచేయించారు. పని ప్రదేశంలో వీటిని ఏర్పాటు చేయాలని మండల కేంద్రానికి తీసుకొచ్చారు. అంతవరకు బాగానే ఉంది, కానీ అక్కడి నుంచి పని ప్రదేశంలో ఆయా బోర్డుల ఏర్పాటులో ఇక్కడి ఉపాధి హామీ పథకం అధికారుల నిర్లక్ష్యం సష్టంగా కనిపిస్తోంది. గత ఏడాదిలో వచ్చిన నేమ్ బోర్డులను పని ప్రదేశంలో పెట్టకుండా అల్లూరి గ్రౌండ్‌లోని తుప్పల వద్ద పడేశారు. నెలల తరబడి వాటిని అలాగే వదిలేయడంతో తుప్పు పట్టి పాడౌతున్నాయి. లక్షలాది రుపాయల ఉపాధి నిధులతో చేయించి తెచ్చిన బోర్డులను పని ప్రదేశంలో పెట్టకుండా ఇలాగే నిర్లక్ష్యంగా వదిలేసిన సంబంధిత యంత్రాంగంపై చర్యలు చేపట్టి, వీటికయ్యే ఖర్చును వాటి నుంచి రికవరీ చేయాలని, అలాగే కొత్తగా బోర్డులను తయారు చేయించి పనిప్రదేశంలో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నిర్లక్ష్యంగా పడేయడంతో పాడైన ఉపాధి బోర్డులు

ఖాతాదారుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిజివిబి ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం ధర్నా

బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి- పాడేరు :చింతపల్లి ఎపి గ్రామీణ వికాస బ్యాంక్ ఖాతాదారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనంజయ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో చింతపల్లి మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంక్ ఎదుట ఖాతాదారులతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతాల్లో జమ అయిన నగదు బయట విత్ డ్రా చేసుకోకుండా రెండు నెలల నుంచి గ్రామీణ బ్యాంక్ సర్వర్ నిలిపి వేశారని మండిపడ్డారు. చింతపల్లి గ్రామీణ బ్యాంకులో చింతపల్లి, జికె.వీధి రెండు మండలాలకు చెందిన సుమారు 38వేల మంది ఖాతాదారులుండగా, వారి ఖాతాల్లో జమ అయిన నగదును వ్యక్తిగత అవసరాల కోసం తీసుకోవాలంటే రూ.రెండు వేలకు మించి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో బ్యాంకు మిత్ర ద్వారా తీసుకుందామంటే కమీషన్ల బెడద ఉంటోందని ఖాతాదారులు వాపోతున్నారన్నారు. పోనీ ఎటిఎం ద్వారా తీసుకుందామంటే అవకాశం లేకుండా చేయడం దారుణమన్నారు. సుమారు 40 కిలోమీటర్ల దూరం నుంచి ఖాతాదారులు బ్యాంకు వచ్చి సాయంకాలం వరకు పడిగాపులు పడితే రూ.రెండు వేలు ఇస్తున్నారన్నారు. భారీ సంఖ్యలో ఖాతాదారులు బ్యాంకు వస్తుండడంతో వచ్చిన వారిలో కొందరికి ఆ రూ.రెండు వేలు కూడా అందకుండా ఒట్టిచేతులతో ఊసూరుమంటూ వెళ్లిపోయే పరిస్థితి కల్పించడం దారుణమన్నారు.అంతేకాక బ్యాంకుకు రావాలంటే నాలుగైదు వందలు ఛార్జీలు, ఇతర ఖర్చులకే సరిపోతుందని మండిపడ్డారు. దీనిపై బ్యాంకు మేనేజర్‌ను అడిగితే ఏవేవో కుంటిసాకులు చెప్పి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఎపిజివిబి చింతపల్లి బ్రాంచ్ ఖాతాదారుల సమస్యను ఐదు రోజుల్లో పరిష్కరించకుంటే, బ్యాంకు ఎదుటే ఖాతాదారులతో నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, నాయకులు మజ్జి రాంబాబు, ఖాతాదారులు పంతల రాము, సాగిన లోవరాజు, వంతల రాంబాబు, సిహెచ్ కొండలరావు, జె చిట్టిబాబు, పి రాంబాబు, ఇంకా 150 మంది ఖాతాదారులు పాల్గొన్నారు.

లకేపుట్టులో తాగునీటి ఇక్కట్లు

ప్రజాశక్తి - పెదబయలు : సీతగుంట పంచాయతీ లకేపుట్టు గ్రామంలో కొన్నాళ్లుగా నెలకొన్న తాగునీటి ఎద్దడిపై స్థానిక మహిళలు సర్పంచ్ పి.మాధరరావు దృష్టికి తెచ్చారు. వేసవిలో నీరు ఇంకిపోతుందని, ప్రస్తుతం వర్షాకాలంలో బురద, కలుషిత నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌కు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన సర్పంచ్ మాధవరావు వెంటనే సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఫోనులో మాట్లాడి సమస్యను విన్నవించారు. రెండు రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు హామీనిచ్చినట్లు మహిళలు తెలిపారు. అధికారులు చెప్పినట్లు రెండు రోజుల్లో సమస్యల పరిష్కారం కాకపోతే ఆందోళన చేస్తామన్నారు.

సర్పంచ్‌కు సమస్యను విన్నవిస్తున్న మహిళలు

టిడిపిలో చేరిన నేతలతో మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

టిడిపిని గెలిపించాల్సిన బాధ్యత ప్రజలదే : కిడారి

ప్రజాశక్తి- పెదబయలు : రాష్ట్రంలో వైసిపి దుర్మార్గపు పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయని ముఖ్యంగా గిరిజన ప్రాంతానికి జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిందేమీ లేదని మాజీ మంత్రికిడారిశ్రావణ్‌కుమార్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో టిడిపి గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ కేంద్రంలో ఐదు గ్రామాలకు చెందిన పార్టీ మండల అధ్యక్షురాలు సీకరి సుకుమారి, మాజీ సర్పంచ్ నరంజి ప్రసాద్, బత్తిరి రామారావు ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదు గ్రామాలకు చెందిన వైసిపి నేతలు, కార్యకర్తలు మాజీ వార్డు సభ్యులు తాళబు రమణమ్మ, గ్రామ పెద్ద కాకరి బంగారయ్య, కాకరి లక్ష్మయ్య సూరిబాబు, కిల్లో వెంకట్, గణేష్‌తో సహా మహిళలు సుమారు 150 కుటుంబాల ప్రజలు మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ సమక్షంలో టిడిపిలో చేరగా, వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వైసిపి పాలనలో ఇసుమంతైనా అభివృద్ధి జరగలేదని, లక్ష్మీపేటలోని పరిస్థితులే ఇందుకు నిదర్శనమన్నారు. లక్ష్మీపేటలో సిసిరోడ్లు, డ్రైనేజీలు లేవని, ఇతర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడిపి అమల్లోకి తెచ్చిన జిఒ3ను సుప్రీంకోర్టు రద్దుచేస్తే దాని పునరుద్ధరణకు వైసిపి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టక గిరిజనానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు పాంగి నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి పాంగి సోన్నే, మాజీ సర్పంచ్ తైసాబు త్రినాథ్, రాష్ట్ర ఎస్‌టి సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణ రాజు, డివిజన్ నేతలు పాంగి పాండురంగస్వామి,అరకు పార్లమెంట్ టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు తామర్ల సత్యనారాయణ, పొద్దు అమ్మన్న అడుగులపుట్టు సర్పంచ్ కొర్ర నూకరాజు, హుకుంపేట ఎంపిటిసి కొమ్మ రమ, సీకరి వెంకటేష్, నరంజి ప్రసాద్, నరంజి కమల, కిముడు మహేశ్వరి, సల్లంగి రవికుమార్, మర్రిచెట్టు అప్పలనాయుడు, కటారి బాలం నాయుడు, కొర్ర లక్ష్మణ్,కిముడు తిరుపతి ఉబ్బేటి శివ సాగర్, పాంగి దన్ను, లకే రమణ దొర, శికరి వెంకటరమణ, కాకరి రామబాబు, కాకరి జీవన్ కోటి, ధనుంజయ, మేఘరాజు, నాగేంద్ర, బొండ గణేష్ పాల్గొన్నారు

గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వేడినీటిలో పడడంతో తీవ్రగాయాల పాలైన ఏడోతరగతి విద్యార్థి పాంగి ఏసయ్యకు మెరుగైన వైద్య అందించాలని, పాఠశాలలో జరిగిన ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు.బుధవారం అరకులోయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, సుంకరమెట్ట సర్పంచ్ జి చిన్నబాబు, బుజ్జిబాబు పరామర్శించారు. ఘటన జరిగిన తీరుపై బాధిత.విద్యార్థిని అడిగితెలుసుకున్నారు.
ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ సోమవారం రాత్రి 7 గంటల సమయంలో తోటి విద్యార్థి తోసేయడంతో వేడినీటిలో పడి గాయపడిన లోతేరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి పాంగి యేసయ్యకు సకాలంలో సరైన వైద్యసేవలు అందించడంతో యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. తీవ్రగాయాలతో ఏసయ్య రాత్రంతా నరకయాతన పడితే, వెంటనే వార్డెన్, హెచ్ఎం, ఇతర సిబ్బంది స్పందించకుండా, మరుసటిరోజు మంగళవారం ఆసుపత్రి తేవడం దారుణమన్నారు. లోతేరు మారుమూల ప్రాంతం కావడంతో ఉన్నతాధికారుల తనిఖీలు, పర్యవేక్షణ సరిగా ఉండదనే కారణంతోనే పాఠశాల యజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని, దానికి నిదర్శనమే ఈ ఘటన అని ఆరోపించారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ఉండాలంటే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా విద్యార్థి ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను అడగగా, తీవ్రమైన గాయాలతో విద్యార్థి ఇబ్బందులు పడుతున్నాడని, మెరుగవ్వాలంటే వైద్యుల పర్యవేక్షణలో నెలరోజులైనా చికిత్స అందించాలన్నారు. మరోవిద్యార్థి తోసేయడం వల్లే ప్రమాదం జరగడంతో ఎమ్మెల్సీ కేసుగాభావించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో గురుమూర్తి, నానిబాబు, మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జీవన్ కృష్ణ

గురుకుల కళాశాలకు ప్రహరీ నిర్మించాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని కాకరపాడు ఎపి గురుకుల కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పాంగి జీవన్ కృష్ణ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ బృందం బుధవారం కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలపై సర్వే నిర్వహించారు. విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పశువులు లోపలకు వస్తుండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. 25 బాత్ రూమ్స్ ఉన్నా మూడు మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయని, దీంతో కాలేజీకి సమయానికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీవన్ కృష్ణ మాట్లాడుతూ ఐటీడీఏ అధికారులు వెంటనే స్పందించి ప్రహరీ నిర్మించాలని, బాత్ రూమ్స్‌కు మరమ్మతులు చేపట్టి వాడుకలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కళాశాల కమిటీ ఎన్నిక జరిగింది. కళాశాల కమిటీ సభ్యులుగా కిలో మహేంద్ర, కొర్ర శివశంకర్, సిహెచ్.ప్రసాదు, కిమ్ముడు ముకుందా పాంగి వీరబాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర కార్తీక్, మండల కమిటీ సభ్యులు పాంగి రమేష్, గెమ్మెలి ప్రశాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నారెడ్డి

జగన్ బొమ్మ కోసమే సురక్ష

ప్రజాశక్తి-చింతూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బొమ్మ కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు టిడిపి మండల అధ్యక్షులు ఇళ్ల చిన్నారెడ్డి ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇచ్చే సర్టిఫికెట్లుపై జగన్ బొమ్మ ముద్రించడం చాలా తప్పుడు నిర్ణయమని, తర్వాతా వచ్చే ప్రభుత్వాలకు ఆ సర్టిఫికెట్లు ఉపయోగపడవని తెలిపారు.

41.5 కాంటూరులో చేర్చాలి

చిడుమూరు, చట్టి, కుమ్మురు, వీరాపురం, కూయుగూరు, కల్లేరు, ముకునురూ నర్సింపేట, తిమ్మిరిగూడెం, నిమ్మలగూడెం, లక్ష్మీపురం గ్రామాలను పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 41.5 కాంటూర్‌లో చెర్చాలని చిన్నారెడ్డి డిమాండ్ చేశారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుంటే ముంపులో ఉన్న అన్ని గ్రామాలకు పోలవరం ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. గతంలో భూసేకరణ చట్టం ప్రకారం ఒక్కో ఎకరానికి రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు జగన్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు నష్ట పరిహారం రూ.10 లక్షలు ఇవ్వాలని, జిఒ 224ను తక్షణమే అమలు చేయలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, యూత్ సెక్రటరీ శీలం తమ్మయ్య, అనిగి చంద్రయ్య, మిడియం శివకృష్ణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డౌనూరులో కాఫీ శుద్ధి కర్మాగారానికి..

రూ.5 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజవర్గం డౌనూరులో కాఫీ శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రూ.5 కోట్లు మంజూరు చేసినట్టు గిరిజన సహకార సంస్థ ఛైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి మీడియాకు తెలిపారు. కాఫీ ప్రాజెక్టు, అంతర్గతంగా కాఫీ తోటల పునరుజ్జీవనం కోసం 2023-24 వార్షిక సంవత్సరానికిగానూ పై నిధులను విడుదల చేసినట్టు వెల్లడించారు. ఈ నిధులను డౌనూరు వద్ద సమగ్ర కాఫీ శుద్ధి కర్మాగారానికి రూ.3 కోట్లు, 2023-24లో ముడి కాఫీ కొనుగోళ్లు, మార్కెటింగ్ సదుపాయానికి రూ.2 కోట్లు కేటాయించనున్నట్టు వెల్లడించారు. నిధులు కేటాయించిన సిఎంకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కబ్జాలకు రాజకీయ అండ

ఎండాడ సర్వే నెంబర్ - 1 ఆక్రమణల పుట్ట
కళ్లు మూసుకున్న రెవెన్యూ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

భూ కబ్జాలకు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండ పుష్కలంగా ఉండడంతో ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో కొంతమంది 'చోటా' నాయకులకు దోచుకోవడమే పనిగా మారింది. ప్రభుత్వ భూమి, చెరువు, గెడ్డ కనిపిస్తే చాలు.. దురాక్రమణకు దిగిపోతున్నారు. రెవెన్యూ, జివిఎంసి యంత్రాంగం చూసీచూడనట్లుగా.. మరీ ఎవరైనా గట్టి ఫిర్యాదులు చేస్తే తూతూ మంత్రంగా సర్వే చేసి రికార్డుల్లోకి రాకుండా నోటిమాటతో ఎదుటివారిని సమాధాన పరచడం పరిపాటిగా మారింది. ఎండాడలోని సర్వే నెంబర్ - 1 పూర్తి అక్రమాల పుట్టగా మారిపోయింది. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురౌతున్నాయి. రుషికొండలో రూ.300 కోట్ల విలువైన సర్వే నెంబరు 29/1, 29/2లోగల 7 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక నేత చెన్నాదాస్ ఏనాటి నుంచో గుప్పెట్లో పెట్టుకుని రెవెన్యూ యంత్రాంగానికి తృణమో ఫణమో ఇచ్చి దోచుకుని దొరగా చెలామణీ అవుతున్నాడు.

మొగదారమ్మ గుడి వద్ద ఆక్రమణకు గురైన స్థలం

మొగదారమ్మ గుడి వద్ద తాజా భూ కబ్జా

తాజాగా సాగర్‌నగర్ మొగదారమ్మ గుడి వద్దగల ఖాళీ స్థలం సుమారు 200 గజాల ప్రభుత్వ భూమిపై అధికార పార్టీ నేత కన్ను పడింది. దీనిని పక్కాగా జివిఎంసి భూమిగా గుర్తించారు. అయినా రాజకీయ అండతో కబ్జాకు గురవుతోంది. సుమారు రూ.10 కోట్ల విలువైన మొగదారమ్మ గుడి (ఇస్కాన్ సమీపంలో) భూమిని బినామీ పేర్లతో అధికార పార్టీ నాయకుడొకరు ఆక్రమించేస్తున్నట్లు స్థానికంగా ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఇక్కడ భూమినంతటినీ యంత్రాలు పెట్టి చదును చేసేశారు. సిసి కెమెరాల నిఘా నీడన రాత్రీ, పగలూ పనులు చేపట్టడం ఈ సర్వే నెంబర్లలో నిరంతరం జరుగుతోంది. స్థానిక రెవెన్యూ సిబ్బందికి తెలిసినప్పటికీ దీనిపై నోరెత్తడం లేదు. మరో వైపు సర్వే నెంబరు 61లోగల సుమారు 67 ఎకరాల గెడ్డను కప్పేసి ఓ అధికార పార్టీ నాయకుడు చుట్టూ కంచె వేసేసినా మధురవాడ జివిఎంసి అధికారులు మిన్నకుండడం విశేషం.

తూతూ మంత్రంగా సర్వేలు

ఇటీవలే విశాఖ గ్రామీణ తహాశీల్దార్ కార్యాలయం నుంచి ఆర్ఐ, సర్వేయరు ఇతర సిబ్బంది నలుగురు వచ్చి సర్వే నెంబరు 61లో సర్వే చేసి వెనక్కి వెళ్లినా అక్కడ పనులు మాత్రం ఆగడం లేదు. భూమిని కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అనువుగా ఇక్కడ గెడ్డను మార్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఈ భూమిని అధికార పార్టీ స్థానిక నాయకులే సదరు రియల్ ఎస్టేట్‌దారుకు అమ్మేసినట్లు తెలుస్తోంది. తాజాగా భారీ రియల్ ఎస్టేట్ వెంచర్‌తో సదరు గుత్తేదారు పనులు చేపడుతున్నాడు.

ఫార్మా ప్రమాదాలపై న్యాయ విచారణ జరపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లాలో తరుచూ జరుగుతున్న ఫార్మా ప్రమాదాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టిడిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్ధా వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మా కంపెనీలతో నెల మామూళ్ల ఒప్పందం పెట్టుకుని ప్రభుత్వంలోని పెద్దలు ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల పేలుడు సంభవించిన సాహితీ కంపెనీకి సీలు వేసారేగానీ యజమానులను అరెస్ట్ చేయలేదన్నారు. ప్రమాదాలు, భద్రతా ప్రమాణాలపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సాహితీ కంపెనీతో మంత్రికి ఏమైనా ముడుపుల సంబంధం ఉందా ? అని అడిగారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. గాయపడ్డవారిని జీవితాంతం ఆదుకోవాలన్నారు. జగన్ ప్రధానిని కలవడానికి ఎందుకు వెళ్లారో తెలియజేయాలని డిమాండ్ చేశారు

1950కి పూర్వ జనన, మరణ రికార్డు ఆధారంగా..

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆదివాసీ ప్రాంతంలో కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేటప్పుడు కచ్చితంగా 1950కు పూర్వం జనన, మరణ రికార్డులను పరిశీలించి వాటి ఆధారంగా మాత్రమే ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఆదివాసీ జెఎసి నాయకులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష ద్వారా ఉచిత కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం మంచిదే అయినా, దీని వల్ల వేరే కులాల వాళ్లు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు పొందే అవకాశం ఉందని, దీంతో నిజమైన ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాల రెవెన్యూ అధికారులు లంచాలకు కక్కుర్తి పడి వేలల్లో నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారని ఆరోపించారు. గిరిజనేతరులు ఆదివాసీ మహిళలకు మాయ మాటలు చెప్పి లోబర్చుకొని రెండో భార్యగా చేసుకొని ఆ మహిళకు పుట్టిన సంతానంతో పాటు మొదటి భార్య సంతానానికి కూడా ఎస్‌టి కులధ్రువీకరణ పత్రాలు పొందుతున్న సందర్భాలున్నాయని తెలిపారు. తండ్రి గిరిజనేతరుడైతే వారి పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్‌టి కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జెఎసి నాయకులు కంగల శ్రీనివాస్, పోడియం పండు దొర, చవలం శుభ కృష్ణ, మట్ల కృష్ణారెడ్డి, మడకం ప్రసాద్, కారం రామన్న దొర, పోడియం శ్రీనుబాబు, కంగల అబ్బాయి దొర, పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, కత్తుల వెంకట రమణా రెడ్డి, కర్రి సన్యాసిరెడ్డి, సోళ్ళ బొజ్జి రెడ్డి ఉన్నారు.

గాయపడ్డ యువకునికి పరామర్శ

ప్రజాశక్తి-కొయ్యూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖ కెజిహెచ్ ఐసియులో చికిత్స పొందుతున్న యువకుడిని నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివ ప్రసాద్ బుదవారం పరామర్శించారు. మండలంలోని ఎం.మాకవరం గ్రామానికి చెందిన సంబే సాయి కుమార్ (23) రెండు రోజుల క్రితం బైక్ మీద ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో ఆయన్ను విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, ఐసియులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తన భర్త, సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్‌కు తెలియజేయగా ఆయన బుధవారం కెజిహెచ్‌కు వెళ్లి సాయికుమార్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిగతులపై డాక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

హైదరాబాద్ - కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ - కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ మేరకు 07165 హైదరాబాద్ - కటక్ ప్రత్యేక రైలు జులై 4, 11, 18, 25 తేదీలలో ప్రతి మంగళవారం రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 09.07 గంటలకు బయలుదేరి సాయంత్రం 17.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్ - హైదరాబాద్ ప్రత్యేక రైలు కటక్‌లో జులై 5, 12, 19, 26 తేదీలలో ప్రతి బుధవారం రాత్రి 22.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07.35 గంటలకు దువ్వాడ చేరుకుని, మరలా 07.37 గంటలకు బయలుదేరుతుంది. రాత్రి 21.00 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది.

డిజైన్ థింకింగ్‌పై 7, 8 తేదీల్లో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చైర్, ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 7, 8 తేదీలలో డిజైన్ థింకింగ్ - ట్రాన్స్ - డిసిప్లీనరీ ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ అంశంపై జాతీయ సదస్సును బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఎయు సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలను ఆయన వెల్లడించారు. సదస్సును శుక్రవారం ఉదయం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. సదస్సులో ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రముఖ డిజైన్ థింకింగ్ నిపుణులు, ఇఎస్ఎస్ సంస్థ వ్యవస్థాపక సంచాలకులు సాయిరాం బొల్లాప్రగడ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 886 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు వెల్లడించారు. సదస్సుకు 1500కుపైగా పరిశోధన పత్రాలు వచ్చాయని, వీటిలో 452 పరిశోధన పత్రాలను ఎంపిక చేసి చర్చిస్తామని అన్నారు.